క్లుప్తంగా

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

మూసాపేట: పాడి రైతులు తప్పనిసరిగా తమ గేదెలు, ఆవులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డా.మధుసూదన్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని జానంపేటలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం స్థానిక పశువైద్య కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి పశువైద్య సేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో వెటర్నరీ ఏడీ వెంకటయ్య గౌడ్, పశువైద్యాధికారులు డా. సింధుజ, డా.మధుసూదన్, సిబ్బంది ప్రభాకర్, చంద్రమోహన్ గౌడ్, శివ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక వాతావరణంతో ఆయుష్షు వృద్ధి

నవాబుపేట: ఆధ్యాత్మిక వాతావరణం మనిషి ఆయుష్షు పెంచుతుందని మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తీగలపల్లిలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అందరూ కలిసికట్టుగా దేవాలయం నిర్మించి.. దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించడం అభినందనీయమన్నారు. అదే విధంగా తీగలపల్లి, ఇప్పోనిబావి గ్రామాల్లో నిర్వహించిన దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో వారు పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ అనంతయ్య, నారాయణ, చెన్నప్ప, జంగయ్య, రాజు పాల్గొన్నారు.

అంబేడ్కర్, పూలే విగ్రహాల ఆవిష్కరణ

జడ్చర్ల టౌన్: మండలంలోని గొల్లపల్లిలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాలను మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు డా.లక్ష్మారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్, పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పిలుపునిచ్చారు.

ఉగ్రవాదులను అంతమొందించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై దాడిచేసి చంపిన ఉగ్రవాదులను అంతమొందించాలని సీపీఎస్ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రకాంత్ డిమాండ్ చేశారు. ఉగ్రదాడిలో మరణించిన వారికి గురువారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు రాఘవేందర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, గోపాల్, ఆంజనేయులు, లక్ష్మయ్య, విజయ్, భాస్కర్, బాబు పాల్గొన్నారు.

అర్హులకే ఇళ్ల కేటాయింపు

దేవరకద్ర రూరల్: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉన్న నిజమైన అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండలంలోని బస్వాయపల్లిలో ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన వారి ఇంటి స్థలాల వివరాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఈ రాఘవేంద్ర, కార్యదర్శి ప్రదీప్, నాయకులు విక్రమ్, గోవర్ధన్ పాల్గొన్నారు.

సామాజిక సేవే లక్ష్యం

జడ్చర్ల టౌన్: వాసవీ క్లబ్, వనితా క్లబ్ సంయుక్తంగా సామాజిక సేవా కార్యక్రమాలే లక్ష్యంగా పనిచేస్తున్నాయని క్లబ్ రీజియన్ చైర్మన్ ఆనంద్‌రాజ్ అన్నారు. గురువారం పట్టణంలోని వాసవీ కమాన్ వద్ద ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనురాగిణి ఆశ్రమానికి ఎయిర్ కూలర్ అందజేశారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు చిత్తనూరి రామకృష్ణ, వాసవీ వనితాక్లబ్ అధ్యక్షురాలు జ్యోతి, ఆలయ చైర్మన్ చంద్రయ్య, రీజియన్ చైర్మన్ ఆనంద్‌రాజ్, జోన్ చైర్మన్ లట్టుపల్లి చంద్రశేఖర్, కండె కృష్ణ, వెంకటేశ్, హన్మంత్‌రావు, వసుధరాం, సరిత, ప్రసన్న పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతిపై సంతాపం

దేవరకద్ర: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న దేవరకద్ర మాజీ సర్పంచ్ డా.మధుసూదన్‌రెడ్డి (72) గురువారం మృతిచెందారు. డాక్టర్ సాబ్‌గా పేరు తెచ్చుకున్న ఆయన.. 1981 నుంచి 1988 వరకు దేవరకద్ర సర్పంచ్‌గా పనిచేశారు. నాలుగున్నర దశాబ్దాలుగా వివిధ పార్టీల్లో పనిచేసిన మధుసూదన్‌రెడ్డి.. బీజేపీ అమరచింత నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉండి 2004లో ఎమ్మెల్యేగా పోటీచేశారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్‌లో చేరి కొంతకాలం పనిచేశారు. ఆయన మృతిపై పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.



మహబూబ్‌నగర్ మండలం బొక్కలోనిపల్లిలో..



కోయిల్‌కొండలో..



భూత్పూర్ చౌరస్తాలో..



హన్వాడలో..

కదిలిన కార్మిక లోకం

- జిల్లాలో ఘనంగా మే డే వేడుకలు
- కార్మిక సంఘాల జెండాలను ఆవిష్కరించిన నాయకులు
- జడ్చర్లలో మున్సిపల్ కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

సాక్షి నెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా గురువారం మేడే వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా గ్రామగ్రామానా కార్మిక సంఘాల నాయకులు జెండాలను ఎగురవేశారు. జడ్చర్లలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ముందుగా కార్మికులకు మేడే కానుకగా దుస్తులు పంపిణీ చేశారు. పట్టణ పరిశుభ్రతకు నిరంతరం శ్రమించే కార్మికులకు అన్నివిధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ వద్ద జెండా ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రి వద్ద జెండావిష్కరణ చేశారు.

■ మే డే స్ఫూర్తితో సమష్టిగా పోరాడి హక్కులు సాధించుకుందామని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.రాములు పిలుపునిచ్చారు. జడ్చర్ల అంబేడ్కర్ కళాభవన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన మే డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దీప్లానాయక్, మున్సిపల్ వర్కర్స్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్, యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ పాల్గొన్నారు.

■ జిల్లా కేంద్రంలోని కళాభారతి వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో జిల్లా కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి మాట్లాడారు. కార్పొరేట్ అధిపతులకు ప్రజా సంపదను కట్టబెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మిక వర్గానికి తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు వన్‌టౌన్ చౌరస్తా, పండుగ సాయన్న రైల్వేగేటు, బోయపల్లి, ఎదిర, ఎనుగొండ, పాల్కొండ, సీడ్ బ్యాంక్ గోదాం, దొడ్డలోనిపల్లి, బజార్ హమాలీస్ యూనియన్, కూరగాయల హమాలీ యూనియన్, భవన నిర్మాణ కార్మిక సంఘం, మెడికల్ రిప్స్ యూనియన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ భవనాల వద్ద జెండాలను ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు కిల్లె గోపాల్, కమర్‌అలీ, చంద్రకాంత్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కౌకుంట్లలో..

■ టీయూసీఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో జెండా ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సి.వెంకటేశ్, జిల్లా రైస్ అండ్ ఆయిల్ మిల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు పి.దాస్ తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్లలో కార్మికులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

■ కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని మహబూబ్‌నగర్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. జీజీహెచ్ ఆవరణలో తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్, కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు.

■ కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడియాల మోహన్ పిలుపునిచ్చారు. మహబూబ్‌నగర్ మండలంలోని బొక్కలోనిపల్లి, రామచంద్రాపూర్, మణికొండ, పోతన్‌పల్లి, మాచన్‌పల్లి, కోటకదిర, కోడూర్, జమిస్తాపూర్, ధర్మాపూర్ గ్రామాలతో పాటు మన్యంకొండ చౌరస్తాలో కార్మిక, కర్షక జెండాలను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, సహాయ కార్యదర్శి భగవంతు, సీఐటీయూ మండల కార్యదర్శి రాజు, ఆటో యూనియన్ అధ్యక్షుడు చిన్న వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

■ నవాబుపేటలో నిర్వహించిన మే డే వేడుకల్లో వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ నాయకులు శ్రీను, వెంకటయ్య, విజయలక్ష్మి పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని జీజీహెచ్ ఆవరణలో..



టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో..

■ చిన్నచింతకుంట మండలంలో నిర్వహించిన వేడుకల్లో టీఎఫ్‌టీయూ, టీయూసీఐ, సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో జెండాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు పి.యాదగిరి, భార్గవి, జేఎస్ దేవదానం పాల్గొన్నారు.

■ భూత్పూర్ మున్సిపాలిటీలో సీఐటీయూ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కురుమూర్తి, యాదయ్య, వెంకటయ్య, నర్సింహులు, రవి పాల్గొన్నారు.

■ కోయిల్‌కొండ మండల కేంద్రంతో పాటు మల్కాపూర్, పారుపల్లి, కేశ్వాపూర్, ఇబ్రహీంనగర్, రాంపూర్ గ్రామాల్లో సీఐటీయూ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిరుమలయ్య పాల్గొని మాట్లాడారు.

■ గండేడ్ మండల కేంద్రంతో పాటు సల్కర్‌పేట, వెన్నచేడ్ గ్రామాల్లో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భీమయ్య, చెన్నయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, నర్సింహులు, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

■ మూసాపేట మండలం జానంపేటలో పంచాయతీ కార్మికులకు గ్రామానికి చెందిన మలేల శ్రీధర్ గౌడ్ దుస్తులతో పాటు సేఫ్టీ కిట్లు పంపిణీ చేశారు.

■ హన్వాడలోని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు రంగన్న, తిమ్మన్న, రాములు, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

■ దేవరకద్ర, కౌకుంట్ల మండల కేంద్రాలతో పాటు డోకూర్, మీనుగోనిపల్లి, వెంకటగిరి గ్రామాల్లో టీయూసీఐ ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సాంబశివుడు, సీహెచ్ రాంచందర్, కొండారెడ్డి, రాజు, బాలు తదితరులు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ ప్రారంభం



మహబూబ్‌నగర్ క్రీడలు: జెడ్పీ మైదానంలో జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా మహబూబ్‌నగర్ డివిజన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి కరాటే శిక్షణ శిబిరాన్ని గురువారం స్టేట్ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, కరాటే మాస్టర్ ఎత్తినె చెన్నయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో విద్యార్థులకు ఉచితంగా అందించే కరాటే శిక్షణ శిబిరం జూన్ 1వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు పాల్గొనవచ్చని అన్నారు. కార్యక్రమంలో మహిళా ఇన్‌స్ట్రక్టర్లు ఐశ్వర్య, భూమిక పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: వేసవి కరాటే శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా వైస్ చైర్మన్ చెన్నవీరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రఫీక్ పటేల్, కార్యదర్శి అబ్దుల్ జకీ తెలిపారు. జిల్లా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కింగ్‌షోటోకాన్ కరాటే డూ ఇండియా ఆధ్వర్యంలో గత 26 ఏళ్ల నుంచి వేసవిలో ఉచిత కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది మూడ చోట్ల వేసవి ఉచిత కరాటే శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేడు (శుక్రవారం) జిల్లా కేంద్రం షాసాబ్‌గుట్టలోని అల్‌నూర్ స్కూల్, 3న నాగార్జున స్కూల్, 5వ తేదీన మహాత్మాగాంధీ రోడ్ స్కూళ్లలో శిబిరాలు ఉంటాయని తెలిపారు. కింగ్‌షోటోకాన్ ఫౌండర్ జహంగీర్‌పాషఖాద్రీ మాట్లాడుతూ ఈ ఏడాది 27వ వేసవి ఉచిత కరాటే శిక్షణా శిబిరాలను జూన్ 1 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు శిబిరాలు ఉంటాయన్నారు. శిబిరాల్లో కరాటే, కిక్‌బాక్సింగ్, జూడో, బాక్సింగ్, యోగా, ఫిజికల్ ఫిట్‌నెస్‌పై శిక్షణ అందజేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం బెల్టుగ్రేడింగ్ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తామని వెల్లడించారు. ఆసక్తిగల వారు 9849301171 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో సత్తా చాటిన 'కృష్ణవేణి'



విద్యార్థులను అభినందిస్తున్న కృష్ణవేణి స్కూల్ డైరెక్టర్ షరీఫ్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ఎస్‌ఎస్‌సీ ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాల విద్యార్థులు జీషాన్ 573, అబ్దుల్ సాబీబ్, తంజియా తబస్సుమ్ అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారు. అత్యుత్తమ ప్రతిభకనబరిచిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ షరీఫ్ అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ సత్తార్, ప్రిన్సిపాల్ ముస్తఫా, ఏజాజ్ పాల్గొన్నారు.

పుట్టిన గడ్డకు మంచి పేరు తేవాలి

- పదో తరగతి విద్యార్థులను అభినందించిన కలెక్టర్ విజయేందిర

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించి పుట్టిన గడ్డకు మంచి పేరు తీసుకువాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివి జోగుళాంబ జోన్‌లోనే అత్యధిక మార్కులు సాధించిన నవాబుపేట మండలం కొల్లూరు విద్యార్థి బి.సాయిచరణ్‌తేజ్‌తో పాటు బాదేపల్లి హైస్కూల్ విద్యార్థిని అనన్య (563), తేజస్విని (562), సాహితి (551)లను కలెక్టర్ శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. బాగా చదివే విద్యార్థులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో మెరుగైన విద్య అందిస్తుండటంతోనే పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని అన్నారు. కార్యక్రమంలో డీఈఓ ప్రవీణ్ కుమార్, ఏఎంఓ శ్రీనివాస్, హెచ్‌ఎంలు శ్రీకాంత్, చంద్రకళ పాల్గొన్నారు.



విద్యార్థి సాయిచరణ్‌తేజ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ విజయేందిర

ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలి..

రాజాపూర్: జీవితంలో ఎంచుకునే లక్ష్యాలను చేరుకోవాలంటే చదువులో మెరుగైన మెరిట్‌లు మరిన్ని సాధించాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి అన్నారు. పదో తరగతిలో మండల టాపర్లుగా నిలిచిన రాజాపూర్ కేజీబీవీ విద్యార్థిని అన్విక (537), సెకండ్ టాపర్ ఓంకుమారి శ్రేష్ఠ (535), అనూష (518)లతో పాటు ఎంఈఓ సుధాకర్, ఉపాధ్యాయులను ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఎంఈఓ సుధాకర్, హెచ్‌ఎంలు శ్రీనివాసరావు, సతీష్ రాథోడ్, శ్రీశైలం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



నిజాలాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఏఓ అనిల్ కుమార్

మూసాపేట: మండలంలోని నిజాలాపూర్‌లో వరి ధాన్యం కొనుగోళ్లు ముందుకు సాగడం లేదని గురువారం రైతులు ఆందోళన చేపట్టారు. గ్రామంలో ఇప్పటి వరకు ఒక లారీ లోడ్ ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని ఆరోపించారు. కల్లాల వద్దే ధాన్యాన్ని ఆరబోసుకొన్నుమని.. అకాల వర్షాలకు తడవకుండా ధాన్యాన్ని కాపాడుకోవడం తమకు తలకు మించిన భారం ఆగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనకు మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్య సాగర్ మద్దతుగా నిలిచారు. అనంతరం ఏఓ అనిల్‌కుమార్ రైతులను కలిసి సమస్యలను తెలుసుకున్నారు. కాగా, కొనుగోలు వేగవంతం చేయాలని.. తుకాల్లో మోసం జరగకుండ కొనుగోలు ప్రక్రియ చేపట్టాలని మాజీ జెడ్పీటీసీ డిమాండ్ చేశారు.

రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం మే డేను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని శ్రీజయరామ మారుతి షోరూంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 50మంది ఉద్యోగులు రక్తదానం చేశారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ.. ప్రమాద బాధితులకు రక్తం చాలా అవసరం ఉంటుందన్నారు. ఇక్కడి ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షుడు నటరాజ్, కంపెనీ మేనేజర్ సరసయ్య, మారుతి సేల్స్ జనరల్ మేనేజర్ వేణుగోపాల్‌రెడ్డి, సిబ్బంది రామకృష్ణ, రామదాస్ యాదవ్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.



శ్రీజయరామ మారుతి షోరూంలో రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

వివాదాస్పదంగా మారిన బీఆర్టీయూ జెండావిష్కరణ

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో బీఆర్‌ఎస్ అనుబంధ యూనియన్ బీఆర్టీయూ జెండావిష్కరణ చేయడం వివాదాస్పదంగా మారింది. గురువారం మే డే సందర్భంగా బీఆర్టీయూ ఆధ్వర్యంలో మాజీ మంత్రి లక్ష్మారెడ్డి జెండావిష్కరణ చేశారు. అయితే మార్కెట్ యార్డు అధికారులు, పాలక మండలి అనుమతి లేకుండా బీఆర్టీయూ జెండావిష్కరణ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయాన్ని కొందరు నాయకులు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. వెంటనే మార్కెట్ కార్యదర్శి నవీన్‌కు ఫోన్‌చేసి వివరణ కోరారు. అయితే తమకు తెలియకుండా జెండావిష్కరణ చేశారని.. వెంటనే తొలగిస్తామని ఆయన తెలిపారు. కాగా, కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీ విభాగం లేకపోవడంతో మార్కెట్ యార్డులో మే డే ఉత్సవాలను నిర్వహించుకోలేక పోయామని కొందరు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.



మార్కెట్‌యార్డులో బీఆర్టీయూ జెండావిష్కరణ చేస్తున్న మాజీ మంత్రి లక్ష్మారెడ్డి

అన్నివర్గాలకు సమప్రాధాన్యం ఇవ్వాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అన్నివర్గాలకు సమప్రాధాన్యం ఇవ్వాలని ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా కోరారు. మే డేను పురస్కరించుకొని గురువారం ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సొసైటీ తరఫున ముఖ్యమంత్రి కార్యాలయానికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టీసీ కార్మికులకు సంపూర్ణ భద్రత కల్పించాలని, 2021, 2025 వేతన సవరణ అమలు చేయాలన్నారు. డీఏ ఏరియర్స్, 2017 పీఆర్‌సీ చెల్లించాలని, స్పెషల్ ఆఫ్ డ్యూటీలుగానే కొనసాగించాలని, 8 గంటల డ్యూటీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆయన కోరారు.

రేపు చిత్రలేఖనం పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: స్ఫూర్తి యువజన సేవా కళాసంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సీతారామాంజనేయ గ్రంథాలయంలో ఈ నెల 3వ తేదీన 5వ తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'భారతదేశంలో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నా చిత్రం' అనే అంశంపై పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తప్పనిసరిగా డ్రాయింగ్, పెయింటింగ్ సామగ్రి తీసుకురావాలని సూచించారు. మరింత సమాచారం 95538 11361 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

మసీదు లెక్కల వెల్లడి

దేవరకద్ర రూరల్: దేవరకద్రలోని జామియా మసీదు లెక్కలపై కోశాధికారి ఫారూక్ అలీ వివరణ ఇచ్చారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మసీదుకు సంబంధించిన డబ్బులను వాడుకున్నట్లు తనపై కొందరు అసత్య అరోపణలు చేస్తున్నారని అన్నారు. పదేళ్ల నుంచి మసీదు దుకాణ సముదాయం నుంచి రూ. 46లక్షలు వచ్చినట్లు వివరించారు. అందులో నిర్వహణ తదితర ఖర్చులు పోగా.. మిగిలిన రూ. 22లక్షల్లో రూ. 19లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు తెలిపారు. మిగతా రూ. 3లక్షలు వివిధ పనుల కోసం ఉంచినట్లు వివరించారు. సమావేశంలో మునీర్, ఖాజామైనొద్దీన్, జాకీర్, జమీల్, గౌస్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవాబుపేట: మండల కేంద్రానికి చెందిన శాకసమోని అంజమ్మ (65) అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ మాజీ నర్సింహాచారి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి.. రూ. 5వేల ఆర్థికసాయం అందజేశారు.

అధ్యాపకురాలికి పీహెచ్‌డీ పట్టా



జడ్చర్ల టౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.పుష్పలత పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పాలమూరు జిల్లా దళిత సాహిత్యం.. జీవన చిత్రం అనే అంశంపై ఆర్ట్స్ కళాశాల ప్రొ. కాశీం ఆధ్వర్యంలో ఆమె పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఈ మేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డా. సుకన్య పుష్పలతను శాలువాతో సత్కరించి అభినందించారు. జడ్చర్లలోనే పాఠశాల విద్య, ఇంటర్, డిగ్రీ ఇక్కడే పూర్తిచేసి.. చదివిన కళాశాలలోనే విధులు నిర్వహిస్తున్న తాను పీహెచ్‌డీ పొందడంపై పుష్పలత ఆనందం వ్యక్తం చేశారు. ఆమెను అధ్యాపక బృందం శ్రీనివాసులు, సులేమాన్, రాఘవేంద్రారెడ్డి, సతీష్‌రెడ్డి, నర్సింహులు, వెంకటయ్య, జబీన్, ప్రవీణ్‌కుమార్, మాధురి, సదాశివయ్య, నర్సింహారావు అభినందించారు.

కులగణన నిర్ణయం చారిత్రాత్మకం

పాలమూరు: దేశ ప్రగతికి కులగణన పునాదివంటిదని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్ అన్నారు. గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కులగణనతో పాటు జనగణనను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. అభివృద్ధి అంటే ఆర్థిక అసమానతలను తొలగించడమే అని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దిక్కుమాలిన రాజకీయాలు చేస్తూ.. కులగణన గురించి ఆలోచించలేదని ఆరోపించారు. మతపరమైన రిజర్వేషన్లు వద్దని చెప్పినా ముస్లింలను కూడా బీసీల కింద గుర్తించి కులగణన లక్ష్యాన్ని తారుమారు చేసిందని విమర్శించారు. దేశం మరింత అభివృద్ధి పథంలో నడిచేందుకు ఈ కులగణన కీలకమైనదని వ్యాఖ్యానించారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పడాకుల బాలరాజు, మాజీ కౌన్సిలర్ చెన్నవీరయ్య, నంబి రాజు, నాగరాజు, పిల్లి సూర్యనారాయణ, కొకుంట్ల ఆంజనేయులు, సుదర్శన్‌గౌడ్, మనోహర్ పాల్గొన్నారు.